# పువ్వాయమ్మ....
# ....పున్నెమా అంటూ?

♦ కధానిక : కవికొండల వేంకటరావు ♦

*

ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది!''

అంటూ అత్యంతాశ్చర్యంగా పువ్వాయమ్మజీ వంట కట్టెను ప్రభాతన్నకు చూపించింది. అప్పుడే పట్టుకు వస్తూవుంది ఆ వంటకట్టెను అడితీలోంచి ఆమె, కసాయివాని బారినుండి రక్షించిన మేకను ఎత్తుకొస్తూవున్నట్టు, ముద్దుగా, జాలిగా—''సూడబ్బా! ఇది అడితీసిగురో అడివిసిగురో—వాళ్లు దీన్నికూడా గొడ్డవేసి పేడు సెయ్యబోతూవుంటే వూళ్ళాక్కునట్టుకొచ్చాను. గుట్ట ఆట్టడుగుది—అడితి సిగురే! అడివిసిగురైతే ఇంతకాలముంటుందా తుండు నంటిపెట్టుకొని, చెట్టుకొట్టేశాక? అడితీసిగురే! ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది! ఇదీ పళంగా పాత్తే వనాంతరమైపోద్దా? ఏం సెట్టౌద్ది అంటావు! ప్రభాతన్నా!'' అంది ఊం-చిగురుతాచూస్తూ ఎదర మనిషికి చూపిస్తూ. ప్రభాతన్న బెరడుగిల్లి మూచూచి ఆకుతుంచి చవిచూచి ''ఆనడంలేదు. ఏం మిత్త్రమో! ఏదో! మారుజాతి గుట్లక్రిందిది లాగుంది. ఇసిత్రంగానే సిగురట్టింది'' అన్నాడు. పువ్వాయమ్మ ''అంతకంటె యిసిత్రంగా వుంటుంది యిదెదిగి పువ్వుపూస్తే—నీసేత్తో పాతేసి పెడుదూనాబాబా! గునపం తీసికొస్తాను'' అంటూ ఆ చిగురుపట్టిన తుండును ప్రభాతన్నకుఅందిచ్చి, తానుగుడిసెలోకివెళ్ళి ఉగునపంపుచ్చుకు—ప్రభాతన్న మఱోతూరి చిగురువంక చూచే ఇంతలో—తిరిగివచ్చింది.

పువ్వాయమ్మగుడిసె యీవలకువచ్చే వెనకాతలే ఆ వటీర ద్వారబంధం ఘట్టుకు పొంచిపొంచి మఱోపణతి తెలిసింది. ఆమెపేరు ఏమైతేం, ఆపణతి పువ్వాయమ్మ కోడలు. మొన్నమొన్నసే ఆధీనం తప్పినపిల్ల. అన్నీ పోగుచేస్తే పద్ధెనిమిధిమీద ముప్పొద్దులకంటె ఎక్కువవుండదు కోడలియీడు.

ప్రభాతన్న గుడిసెవంక చూడకుండానే, పువ్వాయమ్మ అందిచ్చిన గునపంపుచ్చుకుని, పువ్వాయమ్మ చూపెట్టిన స్థలంలో గొయ్యితవ్వి ఉత్తితుండును చిగురుపైకెట్టి, మొదలుకిందగ్రుచ్చి, పాతి,పాదు చేసి, పైల్మాన్‌లా చేతులు దులుపుకుంటూవున్నాడు. పువ్వాయమ్మ కోడలితో ''అలా సెమ్మాలా నిలబడకపోతే పొయివోరనున్న పడుచు చట్టితో నీళ్లట్టుకొచ్చి, కుసిన్ని మొక్కకోసి, కుసిన్ని కుట్టోడి సేతులమీద పోస్తేం?'' అంది మాటలో కసరుకలిపి. కోడలు భయంతో పెద్ద కుండెడునీళ్లు ఆలా మోసుకొచ్చి కొత్తపాదులో ముంతెడునీళ్లు ప్రభాతన్న దోసిట్లో ముంతెడునీళ్ళు వంచింది. ప్రభాతన్న—ఆ పదునెనిమిదేండ్లమీద ముప్పొద్దుల ముగుదను—'గులాబీ'ని చూచినట్టు అనండి, 'గోవా'ను చూచినట్టు అనండి—ఆమెను అట్టే—కనుమొఱగ్గా తిలకించేడు; చూపులో చూపుకలిపి పిల్లవెళ్లిపోతూంటే వెనకాతలే పువ్వాయమ్మతో ''ఆ పిల్లచేత రోజూ దీనికి నీళ్ళు పోయిద్దువా యిదిమంచి గందపుమానుఅయితీరుద్ది. మాణిక్యాల పూలుపూసి కాసుద్ది'' అన్నాడు. పువ్వాయమ్మ ''ఆలా అనుకునే కట్టబెట్టాను నాయనా దీనికీ నా కొడుక్కి.—ఏమని చెప్పుకోను. ఎవరితో మొఱెట్టుకోను—సెట్టంత కొడుకు శివశివామంటా చెల్లిపోయినాడు నిరుడీ రోజుల్లో—ఆడి అంశే ఈ తుండు సిగురనుకుంటా, పెంచమని బోధిస్తా! నీళ్లే పోస్తుందో? నిప్పులే పోస్తుందో? ఉత్తి పొగరుమోతు—నీకు తీఱుబాటు అయినప్పుడల్లావచ్చి యీ వృచ్చాన్ని చూచిపోతూ అవుసరమైనప్పుడు కుసింత గొప్పతవ్వుతూవుండు. నీ సెయ్యి కలిసిన మూర్తంఎలాంటిదో—మొక్క జాజితీగాకావచ్చు, రాజమానూ కావచ్చు'' అంది.

ప్రభాతన్న ''మఱి రానేమో నేను. ఈ పొద్దు యుద్ధంలోకి వెడుతున్నాను. నా మీద ఆశెట్టుకోకు

పిన్నమ్మా!" అన్నాడు నిష్పృహగా. పువ్వాయమ్మ "యుద్ధంలోకే బాబా? నన్నూ తీసికుపోదూ! బతికి పోతాను" అంది. ప్రభాతన్న "యుద్ధంలోకి వెళ్లే వాళ్లు బతకడానికి వెళ్ళరు" అంటూ చిరునవ్వుతో, పువ్వాయమ్మవంక, పువ్వాయమ్మ గుడిసెవంక, గుడిసెముంగట అప్పుడే తాను పాతిన—మొక—మోడు దానివంక తాత్కాలికపు వీడ్కోలుచూపు చూచి వెళ్ళిపోయినాడు.

పువ్వాయమ్మకు ప్రభాతన్న వెనుపట్టి పెద్ద శోకుబల్లలా కొపడింది. వెనక్కు అంతలో నేపిలిస్తే ఏమనుకుంటాడో...అని పిలవకుండా నే..."యుద్ధంలోకి వెళ్లినవాళ్ళంతా చచ్చిపోతారా? అంతా చచ్చిపోరు ప్రభాతన్నా! నీవు తప్పకుండా బ్రతికి తిరిగివస్తావు! వచ్చినప్పుడుమాత్రం ఈ నిర్భాగ్యపు ముండని గాపకం పెట్టుకో" అంటూ స్వగతంగా అనుకుంది. అనుకుంటూ తానొకసారి నూతనపు మొలక యిలకకేసి చూచి గుడిసెలో ప్రవేశించింది.

...ఆ తరుణంలో గుడిసెలోని కోడలి యూహలు? భావాలు?...

పువ్వాయమ్మ గుడిసెలో ప్రవేశిస్తూనే కోడలితో "అణ్ణి సూసినావా?" కోడలు "సూడకేం యుద్ధంలోంచి తిరిగి రావాలిగా!"...కోడలిమాట ఆవలికెన్నడూ అంతవొదుగ్గా వినబడలేదు పువ్వాయమ్మకు. పువ్వాయమ్మ "నాకేంటో...ఆడి ముఖలక్షణమంతా అచ్చు మీ మాంవగారివరుస. వెన్ను తీరుకుగ్రోడిమచ్చు". కోడలు "బావయ్యదికూడా మాంవయ్యపోలికే నంటగా" పువ్వాయమ్మ" ఊఁ. నీవూ ఊకొట్టావు!" కోడలు "ఈ యేలమఱి పాయిలోకి పుల్లలు?". పువ్వాయమ్మ "ఆటియూసే మఱిసిపోనాను: నా బతుగ్గాల! ఈ సిగురుట్టిన తుండు కాపడ్డంతోనే లోకమంతా పెళ్లున వూరేగుతున్నట్టనిపించింది. ఈ పూట కాసితుకూ ఆసిత్రీ పొట్లూపెట్టికానియ్య. నాకు మావేంద్రంగావుంది, వొళ్ళూ వూపిరీ...ఎంచేతో? కోడలు "ఎంచేతేంటి? నీది నీవు నాది నేను పంచేసుకుందామంటే తెగనివ్వవు! వేంద్రంగా వుండదూ?" పువ్వాయమ్మ "ఓహో! ఒఖందు కనుకుంటే ఒకెందు కెట్టురొష్టు. నా మొగుడూ, నీకుపోయినట్టే, పోయినాడు. కాకపోతే తేడా నాకో గుడ్డుకలిగాడు. నీ ఖర్మం నీకుట్ట లేదు. నేనేంచేసేది. "కోడలి కెక్కడలేని దుఃఖం వచ్చేసింది. ముత్యాంల్లాంటి ఆమె కన్నీళ్లు అప్పుడే గుప్పుమన్న పొయిమంట దిగతీత నేపడుతూ చుంయి చుంయి మన్నాయి. పువ్వాయమ్మ "ఏడవక! రోజూ ఆ కొత్తగా పాతిన మొక్కకు ముంతెడు నీళ్లోస్తూ మొక్కోవా మూడోనాటికి బుచ్చిగాడొకడు పుట్టుకొస్తాడు. ఇదేం గొడ్డు లోకంకాదు. ఎన్ని విద్ధాలైనా ఎంత పజ నాశనమైనా మళ్ళామళ్ళా కడుపున పుఁటావుంటారనే శాత్రం" అంది.

అత్తగారి వుపన్యాసానకు కోడలు కుదుటబడి, రోజూ ఆ మొక్కకు నీళ్ళుపోస్తూ క్రమక్రమంగా నలుగురెదటాపడి వెలుగుమళ్ళీ వెలువసాగింది. నడకలో మునపటి నాణ్యం; పలుకులో వెనుకటి విలువ తొలగిపోనట్టే అందఱికూ అగపడుతూ వచ్చాయి.

నాటినతుండు చిగురు తొలేట రివట్లోసి, మలి ఏట రెమ్మవేసి. మూడో ఏటికల్లా మానుకట్టి, నాలుగోఏట చేవెక్కి చిత్రంగా పూతట్టి అలాఅలా ఎనిమిదేళ్ళపాటు తనవంటిచెట్టు మఱిలేదన్నట్టు విరిస్తే విరక్కుండా, వర్ధిల్లింది. చెట్టుపేరుమాత్రం ఒకళ్లకూ ఆ చుట్టుపట్లవాళ్ళకు అంకలేదు ఎంత సాధించినా. అయినా దానిపేరు తెలిసికొందామనే దృష్టిగల మానవులూ లేరు. "ఏదోచెట్టు! నీడిస్తోందా లేదా? అదేశాన" అన్నట్టు దానిక్రిందకు చేరుకుంటూ పదిమందీ చెట్టునుమఱిచి ఏకథ పట్టో చెప్పుకోవడం, దాంతో తెల్లాఱడమో, సందెలడ్డమో, ఇది పరిపాటి, చెట్టుచుట్టూ ఓదిమ్మేసింది పువ్వాయమ్మ. కోఱలా దిమ్మ వారంశారం అలికి ముగ్గెట్టి మోహానం గాలిం

చేది. మఱిచెట్టు కిందకు చేరిన వాళ్ళ నెయ్యాలూ తియ్యాలూ గుడిసెలోని తిరగమోతల్ని మించి వుండేవి.

అప్పట్లో ఆ యుద్ధం ప్రభాతన్న వెళ్ళినప్పటికే మూడేళ్ళయి మొదలెట్టి మఱి ఎనిమిదేళ్ళు అవిరళంగా జరిగి, పదకొండో ఏటితో సమాప్తంఅయింది. ఇరుపక్షాలవారికీ సంధి కుదిరింది. మఱి లోకంలో ఎన్నటికీ ఎక్కడా పోరితం వుండడానికి అవకాశం లేదు. అన్నంత ఐకమత్యత అన్నిదేశాలవారికీ ఏర్పడిపోయింది.

సంధికుదిరి చక్కబడ్డయీవల మాపుల్లో వోమాపు అత్తాకోడళ్ళిద్దఱికీ ఒకరిక్కాకపోతే ఒకరికైనా కంటిమీద కునుకడలేదు.

అన్నట్టు చెప్పడం మఱచిపోయాను. వాకిట్లో చెట్టింకా ఏణార్ధం ఎత్తరికాకుండానే, పువ్వాయమ్మకో కానుపు, పువ్వాయమ్మ కోడలికో కానుపు,మాఱు మనువు వూసులేకుండానే కలిగి, యిద్దరికీ చెరో కొడుకూ నిలిచారు. ఆ బొట్టెలిద్దఱూ నిత్యం సమవయస్కుల్లా ఇంతై, అంతై, ఎంతకైనా చాలుదురన్నట్లు ఒకళ్ళతో వొకళ్లు గుద్దులాడుకుంటూ, అప్పటికప్పుడే చెట్టాపట్టా వేసికుంటూ తమతమ తల్లులకు వినోదం గొలుపగలిగారు. ఎవరూ తనను అడక్కుండానే పువ్వాయమ్మ "అడవిలోతుండొచ్చి అడితీలో ఏలా సిగురట్టిందో ఆలా పుట్టుకొచ్చారు. నాకు వీడూ నా కోడలికి వాడూనుఅని ఆ చెట్టో సామ్యంగా మిన్నముట్టేలా బాహాటంగా ప్రకటించేది. ఆ వుపమానం ఆపె చెబుతూవుంటే బతే నమ్మగ్గా వుండేదిలేండి! ఆ వంక సూడకుండావుండిన వాడొక్కడు లేదనుకోండి...

ఓమాపు అత్తాకోడళ్ళకు కంటిమీద కొను కడలేదన్నాను! ఆ మాపు పొద్దొడవడంలో చెట్టుమీద కాకుల కావుకావు రోజూకన్న ఎక్కువగా వినబడింది. అత్తాకోడళ్ళిద్దఱూ చెట్టుకిందకొచ్చి "ఈ పొద్దు మహ అరుస్తున్నాయి ముండాకాకులు. చుట్టం ఎవడొస్తాడో?" అని అనుకుంటూ తలుపు ఈవల గొళ్లె. సెట్టుకు తలో పనిమీద ఊళ్ళోకి వెళ్ళారు.

కుఱ్ఱవెధవలిద్దఱూ తల్లులు వెళ్ళగాజూచి పరస్పరం కొట్టుకోసాగారు. కొట్టుకొంటూ వారు, యుద్ధసమాప్తిని కడచిన రేత్రే తిరిగివచ్చి ఆ సమయానకు ఆదారేపొయ్యే ప్రభాతన్నను, తమ తగువు తీర్చమన్నట్టు కేకేశారు. ప్రభాతన్న తానూ ఆ పనిమీఎనే వాళ్ళదగ్గఱకు చేరుకున్నట్టు చేరుకుంటూ బొట్టెల్నిద్దర్నీ చెరోచంకనూ ఎత్తుకొని తాను మున్ను నాటిన చెట్టు కొనలుచూస్తూ, మొదట దిమ్మమీద సుఖాసీనుడయ్యాడు. అయి కుఱ్ఱవాళ్ళతో "లోకంలో మఱిపోరితం వుండదనుకున్నాను. మీ రిద్దఱూ ఇప్పుడు కొట్టుకొంటూవుండడంచూస్తే ఆ ఆశపోతూ వుంది నాలో. ఎఱిపిల్లలు మీరు? ఒకరినొకరు కొట్టుకోబోకండి" అని బోధించాడు. బోధిస్తూ తన మిలిటరీకోటు బొత్తాల మెఱుపు వాళ్ళకొక్కపడేలా, బోరకు వాళ్ళిద్దర్నీ హత్తుకుని ముద్దు పెట్టుకొని పంపిచేశాడు.

ఆ కుఱ్ఱలు ఆ ముద్దుకు మురిసిపోతూ పరుగెత్తుకు వెళ్ళినట్టు వెళ్లి వెళ్లి ఎవరితల్లిని వాడు తీసికొని వస్తూ "అమ్మా! ఆ డెవరే?" అంటూ అడుగజొచ్చారు. అత్తాకోడళ్ళిద్దరూ ప్రభాతన్ననుచూస్తూ సిగ్గుపడిపోయారు.

"పువ్వాయమ్మా! నీ పున్నెమాఅంటూ మృత్యువునుజయించి రాగలిగాను. గడియగడియకు ఈ చెట్టు గాపకంవచ్చి సంజీవిలా పనిచేసింది నా మీద రణరంగంలో" అన్నాడు ప్రభాతన్న. పువ్వాయమ్మ "చెట్టు ఘనమైన చెట్టేబాబా! కాని నేమూ నా కోడలూకూడా, ఏమని చెప్పను, నీతికి చెడిపోనాం!" అంటూ కంట తడిపెట్టుకుంది.